# ప్రేమకు కొలమానం



*గోపయంతి ప్రభుతాం*
*యే అనునయంతి చ దాసవత్కుపితాం*
*స్త్రీణాంచ ఏవదయితాః*
*స్వామినః ఏవాపరే వరాకాః స్యుః*

***భావం:*** యజమాని భావాన్ని దాచిపెట్టి, దాసులవలె ఎవరైతే కోపగించిన స్త్రీలను అనునయిస్తారో వారే ప్రియులు. మిగిలినవారు పనికిమాలిన భర్తలు మాత్రమే.

మహారాజావారు రాజనగరులో దసరా ఉత్సవాలు జరుపుతున్నారు. సభలో కవిత్వ పరీక్షలూ, పండిత పరీక్షలూ, మల్లయుద్ధాలూ, విలువిద్యా నైపుణ్య ప్రదర్శనలూ జరుగుతాయి. పోటీలో నెగ్గినవారికి మహారాజు నగదూ,

బహుమతులూ ఇచ్చి సత్కరిస్తారు. ఫణిశర్మ, సత్యశర్మ తమ పాండిత్యాన్ని చూపి సత్కారం పొందాలని గ్రామంనుంచి బయల్దేరారు. రాజధాని దేవాలయాలను సందర్శించడానికై వారి తల్లిదండ్రులు కూడా బయల్దేరారు. ఇంటి పెద్దకొడుకు భాస్కరశర్మ రాజాస్థానంలో ఉద్యోగి, నగరంలో బసకీ, సభా ప్రవేశానికీ ఇబ్బంది లేదు. ఇంటికి కాపలాగా ఫణిశర్మ, సత్యశర్మల భార్యలు రత్నావతీ, సత్యవతీ ఉండాలని నిర్ణయమైంది. సత్యవతి భర్తకు వంద దీనారాలిచ్చి " మా నాన్నగారు పండుగ బహుమతిగా ఇచ్చారు. రాజధానిలో హొంబట్టు చీరలు దొరుకుతాయట. తెచ్చిపెట్టండి" అంది.

రాజధానిలో ఫణిశర్మ, సత్యశర్మలను రాజుగారు వంద దీనారాలతో సత్కరించారు. కొన్ని రోజులకు ఇద్దరూ గ్రామానికి తిరిగి వచ్చారు. తల్లిదండ్రులు నగరంలో ఇంకొన్నాళ్ళుంటామని ఆగిపోయారు. ఇంటికి వచ్చిన వెంటనే ఫణిశర్మ భార్యకు ఒక పట్టుచీర ఇచ్చాడు. హంసలను బంగారు జరీతో అంచుగా, నెమళ్ళను రత్నాలతో పైట కొంగుగా, కుట్టిన చీర మెరిసిపోతోంది. రత్నావతి "చీరఖరీదెంత" అంది.

"తొంభై దీనారాలు" అని భర్త జవాబిచ్చాడు. "మహారాజు మీకు వంద దీనారాలిచ్చారు కదా. చవకలో చీర తెచ్చారేమిటి" అంటూ రత్నావతి తమ గదిలోకి వెళ్ళింది. ఫణిశర్మ ఆమెను అనునయించడానికి ఆమె వెనుకే వెళ్ళాడు.

తన భర్త తనకు తెచ్చిన చీర చూపించడం లేదేమని సత్యవతి ఆశ్చర్యపడింది. అన్నగారికన్నా ఖరీదైన చీర తెచ్చాడేమో, వదినగారి ముందు చూపించకుండా తరువాత ఏకాంతంలో చూపిస్తాడని ఆశపడింది. రాత్రి అయ్యేక ఉండబట్టలేక "నాకు తెచ్చిన చీర ఏదీ" అని అడిగింది.

"పండిత పరీక్షకు మా బావగార్లు వచ్చారు. వారితో మా చెల్లెళ్ళు వచ్చారు. మా అమ్మ ఇద్దరికీ చీరలు కొనమంది. రాజుగారిచ్చిన వంద దీనారాలూ, ఇక్కడ నుంచి తీసికెళ్ళిన వంద దీనారాలూ చెల్లెళ్ళకి చీర నిమిత్తం ఇచ్చాను."

"మా నాన్నగారు నన్ను చీర కొనుక్కోమన్నారు" అంది. సత్యశర్మలో తాను యజమానినన్న భావం తలెత్తింది. " ఏదో నీ తండ్రి మూటలు పంపినట్లు మాట్లాడుతున్నావు. నిన్ను పోషిస్తున్నది నేను."

సత్యవతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అదే సమయంలో ఫణిశర్మ రత్నావతిని "అమ్మ చెల్లెళ్ళిద్దరికీ చీరలు కొనమంది. సత్యశర్మ కొన్నాడు. కానీ నేను రాజుగారిచ్చిన ధనం నీకే ఖర్చుపెట్టాను. చీరలు కొనకపోయినా కనీసం రవికెలైనా ఇవ్వాలి కదా. ఇద్దరికీ చెరో అయిదు దీనారాలిచ్చాను ఈసారి మొత్తం నీ చీరకే ఖర్చు చేస్తాను" అని అనునయిస్తున్నాడు. తమ తప్పులేకపోయినా కొందరు భర్తలు భార్యలను అనునయిస్తారు. న్యాయం భార్యవైపున్నా, ఆమె తప్పు లేకపోయినా యజమానిలా శిక్షించే భర్తలూ ఉంటారు. వారు ఏనాటికైనా ప్రియులు కాగలరా? అలిగిన ఆడదాన్ని అనునయించే ప్రియుడైన భర్త దొరకడం అదృష్టం కదా. మగవారూ, మరి ఆలోచించండి.

******